

# భవానీద్వీపం

## -వనం వేంకట వరప్రసాదరావు



**నాలుగువందల సంవత్సరాల కాలపరిధిలో సామాజిక, చారిత్రక వాస్తవాలను, సాహిత్య, ఆధ్యాత్మిక, యోగశాస్త్ర, మంత్ర శాస్త్ర రహస్యాలను కలుపుతూ సాగిన గాథ. చరిత్ర నిర్ధారించిన సత్యాలు, చరిత్రకు అందని రహస్యాలు, చారిత్రక పురుషుల సాహసాలు, కలగలిపి సమన్వయము చేసిన గాథ. తెలియని కొన్ని వాస్తవాలను తెలియజేస్తూ, తెలుసును అనుకుంటున్న కొన్ని 'అపోహలను' దూరం చేస్తూ సాగే కల్పిత సాహసిక గాథ. స్వతంత్ర సమరరంగముతో మొదలుకొని యుద్ధ, జానపద క్రీడల మర్మాలు, సాధకుల గాథలు, త్యాగధనుల చారిత్రక గాథలు కలిసిపోయిన కాల్పనిక గాథ. ఇలానే జరిగింది అని తెలిసిన సత్యాలకు యిలా కూడా జరిగి ఉండవచ్చు అన్న చారిత్రక పరిశీలనను జోడించి, వాస్తవ దూరం కాని ఊహలతో సాగిన పరిశీలనాత్మకమైన కథ. ఒక సాహసిక యోధుడి కథతో మొదలై క్రీ.శ. 1677 నుండి ఆధునిక కాలంవరకూ తరతరాల అంతరాలను, అంతరంగాలను విభిన్న కోణాలనుండి విమర్శించిన గాథ. కొందరికి తెలిసిన కొన్నిటిని, అందరికీ తెలియాల్సిన ఎన్నిటితోనో సమన్వయము చేస్తూ సాగిన వాస్తవ గాథల, చారిత్రక సత్యాల సమ్మేళనమైన కాల్పనిక గాథ!**

## - 59 -

(క్రిందటి సంచిక నుంచి కొనసాగింపు)

ముఖమంటపంలో ఉత్తరాభిముఖుడై పద్మాసనంలో మంత్రజపం చేస్తున్నాడు శ్రీవిద్యాపూర్ణుడు.

మహాకవి కాళిదాసు కాళీ అనుగ్రహం పొందకమునుపు భిల్లయువతితో కాపురం చేసినప్పుడు కలిగిన ఏకైక సంతానం అతడు. దక్షిణాది స్వామి దయవలన కుమారుడు గతించినా మనుమడిని పొందాడు గౌరీశంకరుడు. ఆ ఆటవిక భిల్లయువకుడికి విధ్యుక్తంగా వలసిన సంస్కారాలు జరిపించి, శ్రీవిద్యాపూర్ణుడు అని దక్షిణాది స్వామి స్వయంగా నామకరణం చేశాడు. జగద్గురువు ఆదిశంకరుల అనుగ్రహంతో పాదుకాంత పూర్ణదీక్షను పొంది ధారానగారానికి తిరిగివచ్చాడు శ్రీవిద్యాపూర్ణుడు. వంశపారంపర్యంగా వచ్చిన కాళీసేవను తాత గౌరీశంకరులనుండి ఆనందంగా అందిపుచ్చుకున్నాడు.

గర్భాలయంలోని మహాకాళీమూర్తి ఒళ్ళు జలదరించే రూపంతో జరుగుతున్నదంతా గమనిస్తున్నట్లున్నది.

ధారానగర రక్షకురాలైన ఆ మహాకాళి ఎన్ని వేల తరాలను చూసిందని! ఆ అమ్మ దయతోనే బాలుడిగా ఉన్న భోజుడు మృత్యుముఖంలోనుండి వసివాడకుండా బయటపడ్డాడు. భోజ చక్రవర్తి ఆశ్రయంకోసం ధారానగరంలో కాలుమోపిన కాళిదాసు ఆ అమ్మ సన్నిధిలోనే భోజుడికి మొదటిసారి తారసపడ్డాడు. నగర రక్షకురాలైన అమ్మను దివ్యమైన అశ్వధాటీ వృత్తంలో ఆశువుగా కీర్తిస్తున్న కాళిదాసును చూసిన భోజచక్రవర్తి ముగ్ధుడైపోయాడు. నిండు యవ్వనంలో వున్న బృహస్పతిలా వున్న ఈ తేజోమూర్తి ఎవరా అని ఆశ్చర్యపోయాడు. ఆ తరువాతి దివ్యగాథ విశ్వవిదితమైంది. నీకు చెప్పాను కదూ!

పాఠకుడా మరిచిపోలేదు కదా! మరిచిపోలేవు కూడా! మరొక మహత్తరమైన చరిత్రకు మంత్రపూర్వకమైన బీజం పడబోతున్నది! మనసును వశంలో ఉంచుకుని జాగ్రత్తగా విను.

ముఖమంటపంలో శుద్ధిచేసిన చోట ఎర్ర రంగులో వున కొత్త పట్టువస్త్రం పరిచి వున్నది. దానిమీద బీజాక్షర సంపుటీకరణంతో ఆహుతులు వ్రేల్చిన దివ్యమైన విభూతి నలుచదరంగా పేర్చబడి వున్నది. ఆ విభూతిమీద దర్భలతో రెండు చతురస్రాలు ఒకదానిమీద మరొకటి ఎనిమిది త్రిభుజాలుగా గీయబడి వున్నాయి. ఎనిమిది కోణాలకు ఎనిమిది త్రిశూలాలు లిఖించబడి వున్నాయి. మధ్యలో 'ఓం' తో మొదలై 'స్వాహా'తో సంపూర్ణమయ్యే అయిదు బీజాక్షరాల దివ్యమంత్రం లిఖించబడి వున్నది. ఆ మధ్యన వున్న మరొక రెండు బీజాక్షరాలను రహస్యంగానే వుంచుతున్నాను. ఎందుకా? అవి మహా రహస్యమైనవి, అత్యంత శక్తివంతమైనవి. ఆ శక్తిని నీ వు తట్టుకోలేవు!

నడుము ఎత్తునవున్న దీపపు సెమ్మెలలో ఉజ్జ్వలంగా వెలుగుతున్న దీపపు కాంతులు మహాకాళి విగ్రహం మీద ప్రతిఫలిస్తున్నాయి. నల్లరాతి విగ్రహం ఎర్రగా ఒళ్ళు జలదరించేలా మెరుస్తున్నది. మూడు కన్నులతో, పది ముఖాలతో, పది చేతులతో, కంఠం దాటి క్రిందకు వ్రేలాడుతున్న ఎఱ్ఱని నాలుకతో భయము, సంభ్రమము కలిగేలా ఉన్నది అమ్మవారు. ఒకచేతిలో ఉన్న శిరస్సునుండి రక్తపు బిందువులు జారుతున్నాయేమో అన్నంత సహజంగా ఉన్నది. వేలసంవత్సరాల క్రితం ఏ దేవశిల్పి చెక్కిన శిల్పమో అది! అది సాక్షాత్తూ బ్రహ్మదేవుడు ప్రతిష్ఠ చేసిన మూర్తి అని ధారానగర స్థలపురాణం చెబుతుంది.

మనోనేత్రంతో తన హృదయపీఠంపై నెలకొని ఉన్న అమ్మను దర్శించుకుంటూ మంత్రశ్లోక జపం చేస్తున్నాడు శ్రీవిద్యాపూర్ణుడు. ఆయన ఎదురుగా పవిత్ర గంగాజలం నింపిన వెండి కలశం ఉన్నది. విభూతి మీద రెండు చతురస్రాలతో, ఎనిమిది త్రిశూలసహిత ముక్కోణాలతో, అయిదు బీజాక్షరాలతో లిఖించిన యంత్రాన్ని ముందుగా ఆ కలశంలోని నీటిమీద లిఖించాడు ఆయన. ఆ మంత్రశ్లోకాన్ని సహస్రజపం చేసి ఆ శక్తిని కలశంలోకి ఆవాహన చేస్తే అది దివ్యమైన తీర్థం అవుతుంది. అది అమృత తుల్యం అవుతుంది. ఆ తీర్థాన్ని స్వీకరించినవాడిని ఆదిశేషుడి విషమైనా ఏమీ చేయదు. వాడు హాలాహలాన్ని కూడా అమృతాన్ని త్రాగినట్లు త్రాగి చిరునవ్వులు చిందించగలడు.

అది నాగపౌర్ణమి తిథి. మంగళవారం. ఆనాడు ఆశ్లేషా నక్షత్రం. అరుదుగా వచ్చే తిథి, వార, నక్షత్ర సంయోగం.

ఆ మంత్రశ్లోకం శ్రీవిద్యాపూర్ణుడికి సాక్షాత్తూ జగద్గురువు ఆదిశంకరులు అనుగ్రహించిన సౌందర్యలహరీ స్తోత్రంలోనిది. ఆదిశంకరులకు ఆ స్తోత్రాన్ని స్వయానా కైలాసవాసి పరమశివుడు అనుగ్రహించాడు.

ముఖమంటపంలో మరొక నల్లరాతి శిల్పంలా  కదలకుండా కూర్చుని ఏకాగ్రచిత్తంతో మంత్రశ్లోక జపం చేస్తున్నాడు శ్రీవిద్యాపూర్ణుడు. చుట్టూ దట్టంగా పెరిగిన చెట్ల ఆకుల మధ్యనుండి కురుస్తున్న వెన్నెల, చుట్టూ కమ్మిన చీకట్లు, ముఖమంటపంలో విద్యాపూర్ణుడు, ఎవరో చిత్రకారుడు నలుపు తెలుపులలో చిత్రించిన చిత్రంలా ఉన్నారు.

ముఖమంటపానికి దక్షిణంగా మంటప శిఖరమంత ఎత్తున పెరిగిన సంపెంగ చెట్లను చుట్టుకుని పెరిగిన పొదలలో కదలిక కలిగింది. పాఠకుడా! నాకే విస్మయం కలిగిన దృశ్యం అది. నమ్ముతావో, నమ్మవో, నీ ప్రాప్తం. కోట్లసంవత్సరాల కాలప్రవాహంలో నీవెంత? నీ నమ్మకమూ, అపనమ్మకమూ ఎంత?  అనంత విశ్వరహస్యాల సాగరంలో అదొక అందమైన అల. అదొక కళ!

సంపెంగ చెట్టు మొదట్లో పొదల మధ్యనుండి ముఖమంటపం మెట్లవైపుకు మెరుపులా వచ్చింది రెండు నిలువుల పొడవున్న గోధుమవన్నె త్రాచు. నిండుపున్నమి వెన్నెలలో చిక్కని పాల ప్రవాహంలా వచ్చింది. నిలువెత్తున్న ముఖమంటపం మెట్లవద్దకు వచ్చి నడుమువరకూ పైకి నిగిడి పడగ విప్పింది. అమ్మవారి దీపపు ఎఱ్ఱని కాంతి, తెల్లని వెన్నెల కాంతి ప్రతిఫలిస్తున్నది అక్కడ. ఆ కాంతిలో ఎఱ్ఱని శోణానదిలో ఎగిసిన సిందూరపు అలలా ఉన్నది ఆ మహాసర్పం. అరిటాకంత వెడల్పున విచ్చుకున్న పడగమీద బంగారు రంగులో శ్రద్ధగా తీర్చినట్లు మెరుస్తూ కనిపిస్తున్నది స్వస్తిక చిహ్నం. అది తక్షక జాతికి చెందిన సర్పం, దేవతా సర్పం!

వేయిమార్లు జపం పూర్తి అయ్యింది. కలశంలోని నీటిని స్పృశిస్తూండగా సంపెంగచెట్టు మొదట్లో, పొదలలో అలికిడిని గమనించాడు శ్రీవిద్యాపూర్ణుడు. అది అలవాటైన అలికిడే. తొట్రుపాటు లేకుండా తలతిప్పి చూశాడు. నిర్మలంగా, ప్రశాంతంగా ఉన్న ఆ చూపులతో చూపు కలిపినట్టుగా నిశ్చలంగా చూసింది ఆ త్రాచు. చటుక్కున పడగ దించి, వేగంగా వెనక్కు మళ్ళింది. సంపెంగ చెట్టుకు అంత దూరంలో విశాలంగా పెరిగిన మారేడు చెట్టువైపుకు పాకింది. సర సర చిటారు కొమ్మపైకి పాకింది. కొమ్మను పెనవేసుకుని పడగవిప్పి కింద ముఖమంటపంలో ఉన్న శ్రీవిద్యాపూర్ణుడినే చూస్తూ ఉండి పోయింది.

ఆకులమధ్యనుండి వెన్నెల కాంతిలో తళతళలాడుతున్న పడగను వెతికి పోల్చుకున్నాడు. చిరునవ్వుతో చిరపరిచితుడైన వ్యక్తిని చూస్తున్నట్లు చూశాడు. ఎక్కడినుండి వస్తుందో తెలియదు. ప్రతి మధ్యాహ్నమూ నడినెత్తిన సూర్యుడున్నప్పుడు వస్తుందా త్రాచు. మారేడు చెట్టు మీదికి పాకుతుంది. మూడు ఆకులున్న దళాన్ని కరిచి పట్టుకుంటుంది. చెట్టుదిగి వచ్చి, ఆ మారేడు దళాన్ని గర్భగుడిలో మహాకాళి పాదాల మీద ఉంచుతుంది. అలా మూడుసార్లు మహాకాళిని మారేడు దళాలతో అర్చిస్తుంది. వచ్చినదారినే సంపెంగ మొదట్లోని పొదలలోకి వెళ్ళిపోతుంది. పున్నమి రాత్రులలో ఆ మారేడు కొమ్మలలో తెల్లని పట్టులాంటి కుబుసాన్ని విడుస్తుంది. మరునాడు మరలా కాళీ పదార్చన చేస్తుంది, వెళ్ళిపోతుంది.

ఉన్నట్టుండి సంపెంగ చెట్టు క్రింది పొదలు తీవ్రంగా కదిలాయి. ఒక్క నిముషంపాటు శ్రీవిద్యాపూర్ణుడు కూడా నివ్వెరపోయే దృశ్యం కనిపించింది. కాలపాశంలా ఉన్న నల్లత్రాచు ఒకటి మెరుపులా పొదల మధ్యనుండి బయటకు వచ్చింది. మంటపంలో ఉన్న వ్యక్తిని చూసింది. సర్రున నడుముదాకా పైకి లేచి పడగ విప్పింది. ఆ నల్లని పడగమీద కూడా బూడిద రంగులో స్వస్తిక చిహ్నం వెన్నెల కాంతిలో స్పష్టంగా కనిపిస్తున్నది. బుసలు కొడుతూ అన్నిపక్కలకూ పడగ తిప్పి చూసింది. మారేడు చెట్టు వైపుకు బాణంలా కదిలింది. కన్ను మూసి తెరిచేలోగా చెట్టుమీదికి నల్లని మెరుపులా పాకింది.

దక్షిణాది సన్యాసి దయతో, ఆదిశంకరుల అనుగ్రహంతో సమస్త శాస్త్రాలనూ ఆపోశన పట్టినవాడు విద్యాపూర్ణుడు. సర్పశాస్త్రం వాటిలో ఒకటి. జంటకోసం వెర్రెక్కి వచ్చింది ఆ నల్ల త్రాచు. అది మగ త్రాచు. పున్నమి వెన్నెల దానిని పొందుకోసం వెర్రెక్కిస్తున్నది. మారేడు చెట్టు మీదున్న ఆడ త్రాచును గమనించింది.

దాని పొందు కోసం వెంపర్లాడుతూ చెట్టు మీదికి పాకింది.

పరిమళ ద్రవ్యంలాంటి జిగురును స్రవిస్తాయి మగ తోడుకోసం అర్రులు చాచే ఆడ సర్పాలు. ఆ పరిమళానికి ఆకర్షింపబడిన మగ సర్పాలు వాటి వెంటబడతాయి. పడగ మీద పడగతో సున్నితంగా చరిచి కోరికను వెల్లడిస్తుంది మగత్రాచు. కొంతసేపు బెట్టు చేసి, సరాగాలాడి పొందుకు సమ్మతిస్తుంది ఆడత్రాచు. కానీ విచిత్రంగా నల్లత్రాచును గమనించిన ఆడ త్రాచు కొమ్మ మీదినుండి కొమ్మ మీదకు అందకుండా దూకినట్లుగా పాకుతూ నేలమీదికి వాలింది. వదలకుండా దాని మీదికి దూకింది నల్లత్రాచు. పెనవేసింది. దానికి చిక్కకుండా విదిలించుకున్నట్లుగా తప్పుకుని సర్రున పొదలవైపు దూసుకుపోవడానికి ప్రయత్నం చేసింది ఆడ త్రాచు.

వెన్నంటి నిలువునా పెనవేసుకుని పడగతో చరిచింది నల్లత్రాచు. మెడ మీద కొరికింది. విదిలించిన కొద్దీ మరీ మరీ వెన్నంటి పెనవేసింది. వాటి బుసలతో ఆలయ ప్రాంగణం దద్దరిలిపోతున్నది. శ్రీవిద్యాపూర్ణుడు ఊహించని సంఘటన జరిగింది.

తనను నిలువునా పెనవేసుకున్న నల్లత్రాచును అంత దూరం పడేట్లు విదిలించి వదిలించుకున్నది ఆడత్రాచు. బాణంలా ముఖమంటపం మెట్లు ఎక్కింది. అది ముఖమంటపం వైపు వస్తుండగా ఎగిరి దూకినట్లుగా వడిగా పక్కకు తప్పుకున్నాడు శ్రీవిద్యాపూర్ణుడు. మంటపానికి అటువైపు వున్న చెట్లు, పొదలమధ్యకు వెళ్ళిపోవడానికి దానికి దారి యివ్వడం ఆయన ఉద్దేశం. కానీ ఆయన ఊహించిన దానికి వ్యతిరేకంగా జరిగింది. జరగకూడని సంఘటన జరిగింది.

పక్కకు పడినవెంటనే నల్లటి కెరటంలా ఉవ్వెత్తున లేచింది నల్లత్రాచు. మెరుపులా ఆడుత్రాచును వెంబడించి ముఖమంటపం మీదకు పాకింది. తనను వదలకుండా వెంబడించడం గమనించింది ఆడత్రాచు. తన దారి మళ్ళించుకుంది. మంటపానికి అటువైపున్న మెట్లమీదినుండి వెళ్ళిపోవడానికి బదులుగా మంటపం మధ్యలోనుండి ధ్వజస్తంభం వైపుకు ప్రవాహంలా పాకింది. ఆ మార్గంలో ఎఱ్ఱని పట్టువస్త్రం మీద, విభూతిమీద చిత్రించిన యంత్రం మీదుగా సుడిగాలిలా దూసుకుపోయింది. మరుక్షణం కీచున సన్నగా అరిచింది. మత్తుగా మూలిగినట్లుగా బుసకొట్టింది. ఆ విసురుకు, ఆ బుసకు విభూతి విరజిమ్మినట్లుగా గాలిలోకి ఎగిసింది. తట్టుకోలేని దెబ్బ తగిలినట్లుగా మెలికలు తిరుగుతూ, పొర్లుతూ ముఖమంటపం నుండి, మెట్లమీదుగా కిందికి దొర్లి ధ్వజస్తంభానికి తట్టుకుని, దానినే చుట్టుకుని ఉండిపోయింది.

కాలపాశంలా వెంబడిస్తూ వస్తున్న నల్లత్రాచు విభూతి తెరలు తెరలుగా గాలిలోకి చిమ్మినవెంటనే సర్రున తోకమీద లేచి పడగ విప్పింది. మరుక్షణం పడగతో నేలమీదకు చరిచింది. కనురెప్పపాటులో వచ్చినదారినే సంపెంగచెట్టుక్రింది పొదల మధ్యలో మాయమైంది.

'అయ్యో! మహాకాళీ! ఎంతపని జరిగింది! ఏమిటీ పరీక్ష!' అంటూ దిగ్భ్రాంతితో మంటపంలో కూలబడిపోయాడు

శ్రీవిద్యాపూర్ణుడు! 'పాహిమాం! అమ్మా! రక్షమాం! క్షమాస్వమాం' అంటూ కంపిస్తున్న కంఠంతో ఆవేదనగా మహాకాళిని వేడుకొనడం ప్రారంభించాడు. ఆయన బాధ యంత్రం భగ్నమైనందుకు కాదు, జరగబోయే విపరీత పరిణామాలను తలచుకుని!

(కొనసాగింపు వచ్చే సంచికలో...)

COMMENTS